# సింగిల్ పేజీ కథ

## అందం

''ఓయ్! రాణీ ఇలారా?'' అప్పుడే బైట నుండి వచ్చిన భర్త గట్టిగా పిలిచాడు భార్యను.

''ఏంటండీ'' గబగబా వచ్చింది రాణి.

''ఆ ఏం లేదు... ఈ రోజు మా కొలీగ్ ఇంటికి అనుకోకుండా వెళ్లాను. గేటు దాటి లోప లికి వెళ్లగానే నన్ను నేను మర్చిపోయాను.'' సంతోషంగా చెప్పాడు భర్త.

''ఎందుకట'' ఆశ్చర్యంగా అడిగింది భార్య.

''ఎందుకంటే.. ఆ ఇంటి ముందు నాకెంతో ఇష్టమైన రోజా ఎంతో హుందాగా తన అందాలతో కనువిందు చేస్తూ నన్ను కట్టిపడేయడంతో కదలలేక పోయాను.'' మరింత ఉత్సాహంగా చెప్పాడు భర్త.

''అబ్బో! అంత అందమా''? అసూయగా అడిగింది భార్య.

''ఆ! ఎంత అందమో? అసలు మాటల్లో వర్ణించనలవి కాదనుకో. ఆహా! ఏమి మృదుత్వం, ఎంత సౌకుమార్యం. తన అందం చూసి తరించాల్సిందే తప్ప మాటల్లో చెప్పనలవి కాదులే'' తన్మయత్వంగా చెప్పాడు భర్త.

''అబ్బబ్బా! ఇక చాల్లెండి సంబడం. అయినా అలాంటివి నాకు నచ్చవని మీకు తెలియదా'' అనుకుంటూ విసవిసా లోపలికెళ్లిపోయింది రాణి.

''అబ్బా! ఈ రాణికేదీ అర్థం కాదు. కోపం మాత్రం ముక్కు మీదే ఉంటుంది'' లోలోన అనుకుంటూ నవ్వుకున్నాడు భర్త.

★ ★ ★

నిద్ర లేచి బెడ్ మీద నుండే ''రాణీ కాఫీ'' అంటూ గట్టిగా కేకేశాడు భార్యను.

''ఇదిగోండి కాఫీ'' ముభావంగా అందించింది రాణి.


ఆమెను చూడగానే ''అబ్బా! రాణీ! రాత్రి కలలో రోజా ఎంత అందంగా ఎన్నెన్ని భంగిమల్లో కనిపించిందో తెలుసా?'' ఆనందంగా అన్నాడు భర్త.

''ఆ మీరు చెబుతున్నారుగా! తెలిసిందిలెండి.'' విసురుగా జవాబిచ్చింది రాణి.

''అది కాదు.. నిజంగా ఎంత అందం. ఓహ్! నేనెంత అదృష్టవంతుడ్ని. నిజజీవితంలో ఇలలో చూడలేని రోజా అందాన్ని కలలో తనివితీరా వీక్షించాను. రోజాను చూస్తుంటే నా మనసు పురివిప్పిన నెమలిలా నాట్యం చేసింది. కోకిలలా పాటలు పాడింది'' అంటూ తన్మయత్వంగా కళ్లు మూసుకొని చెప్పుకుపోతున్న భర్త మాటలకు అడ్డుపడి-

''తనువు పులకరించి పోయింది'' కోపంగా అంది రాణి.

ఆ మాటలకు ఠక్కున కళ్లు తెరిచి మరింత ఆనందంతో ఆశ్చర్యంతో ''ఆ! ఔనౌను! ఎంత బాగా చెప్పావు రాణి నిజంగా'' అంటూ అనబోతున్న భర్తను మధ్యలోనే ఆపి ''అబ్బా! ఇక చాల్లెండి. ఉదయాన్నే లేవగానే దాని సోది మొదలుపెట్టారు. అవతల నాకు బోల్డంత పని ఉంది'' అంటూ రుసరుసలాడుతూ వంటగదిలోకి వెళ్లిపోయింది రాధ.



వారం రోజుల తరువాత ఒక రోజు తీరిగ్గా కూర్చొని ఉన్న భార్య దగ్గరగా వచ్చి- ''రాణీ! నేనో మాట చెప్పనా''? అంటూ అడిగాడు భర్త.

''ఆ! ఏంటో చెప్పండి. దానికి పర్మిషన్ అడగాలా?'' నవ్వుతూ జవాబిచ్చింది రాణి.

''ఆ రోజాను, ఆ అందాన్ని చూడందే నేనుండలేకపోతున్నాను. అందుకే రోజా వాళ్లింటికి వెళ్లి చూసి వస్తున్నాను. అలా పదేపదే వెళ్లడం బాగుండదు కదా! రోజా వల్ల ఆనందాన్ని శాశ్వతంగా పొందాలంటే ఇంటికి తెచ్చుకోవడమే మార్గం. ఇన్నాళ్లు కష్టమవుతుందని తేలేకపోయాను. ఇక ఏది ఏమైనా సరే తీసుకొని వస్తాను. రోజా వల్ల ఇంటికే కాదు.. ఇంటికి వచ్చే వారికి, ఇంటిలోని వారికి కూడా ఆహ్లాదం, ఆనందం కలుగుతుంది'' అంటూ గట్టిగా దృఢనిశ్చయంతో చెప్పిన భర్త వైపు కోపంగా చూస్తూ-

''ఊహూ! నేను చచ్చినా ఒప్పుకోను'' గట్టిగా అంది రాణి.

''నువ్వు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా నేను తీసుకొని వస్తాను.'' మరింత గట్టిగా అన్నాడు భర్త.

''అయితే దాన్నే ఉంచుకోండి. ఇక నేనెందుకు మధ్యలో వెళ్లిపోతాను. మిమ్మల్ని నమ్మి మనసారా ప్రేమించి పెళ్లి చేసుకున్నందుకు తగిన శాస్తి చేశారు'' ముక్కు చీదుతూ రోషంగా వెళ్లబోతున్న భార్యను ఉద్దేశించి-

''ఆగు రాణి! ఏంటా మాటలు. ఇప్పుడు నీకంత కష్టమేమొచ్చింది. ఇంతకీ రోజా అంటే ఎవరనుకుంటున్నావు?'' అనునయంగా అడిగాడు భర్త.

''అది కూడా నా నోటితోనే చెప్పాలా? ఇంకెవరూ మీ మనసును దోచిన ప్రియురాలు'' ఎకసెక్కంగా అంది రాణి.

''ఆహ్హాహ్హా! '' అంటూ గట్టిగా నవ్వి ''అబ్బా.. అందుకే అసూయ ముందు పుట్టి ఆడది తర్వాత పుట్టిందన్నారు పెద్దలు. అసలు రోజా అంటే గులాబి చెట్టన్నమాట. అయినా నా ప్రేమరాణి, సౌందర్య, హృదయ రాణి ఉండగా ఇక వేరే రోజాలెందుకోయి'' ప్రేమగా దగ్గరగా తీసుకుంటూ అన్నాడు భర్త.

''మరల వాళ్లెవరు''? చిలిపిగా అడిగింది రాణి.

''వాళ్లందరూ కలిసి నువ్వొక్కదానివే నోయి'' కళ్లెగరేస్తూ చెప్పాడు భర్త.

''నిజంగానా?'' సంతోషంగా అడిగింది రాణి.

''నిజమే'' మరింత గట్టిగా చెప్పాడు భర్త.

''అబ్బా! మా వారెంతో మంచివారు'' అంటూ ఆనందంగా భర్తను అల్లుకుపోయింది రాణి.

-ఎస్.కె. దుర్గ (క్యాతూరు)